
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 27 మార్చి 2025



ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు

- అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

8 లో



అచ్చెన్నకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతన్న సీఎం చంద్రబాబు



జిల్లాలో కెమికల్ ఇంజనీర్లకు డిమాండ్

- తలసరి ఆదాయం పెంచేందుకు చర్యలు
- ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఏఐ టూల్స్‌పై శిక్షణ
- సీఎంకు వివరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- జిల్లా ఇన్‌చార్జి మంత్రికి చంద్రబాబు చిన్నపాటి క్లాస్



సీఎం చంద్రబాబుకు జిల్లా ప్రగతిని వివరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కెమికల్ ఇంజనీర్లకు విపరీతమైన డిమాండ్ ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ఆయన పాల్గొన్నారు. జిల్లా ప్రగతికి సంబంధించి యాక్షన్‌ప్లాన్‌ను, జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేస్తామన్నదీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'ఫార్మా రంగంలో జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫార్మా సంస్థల నుంచి కెమికల్ ఇంజనీర్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. పాలిటెక్నిక్ కళాశాలలో ఇప్పటికే కెమికల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో కోర్సులు ప్రారంభించాం. జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది తలసరి ఆదాయం రూ.1.85లక్షలు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించాం. జిల్లాలో రైతులు కేవలం వరి మాత్రమే ప్రధానంగా సాగు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలను కూడా ప్రోత్సహించనున్నాం. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగంలో జిల్లాలో (మిగతా 6వ పేజీలో..)

ఐదు రోజులే!

- రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నమోదుకు గడువు
- కేంద్రాలను పరిశీలించిన డీఎస్‌వో సూర్యప్రకాశ్

నరసన్నపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల్లో చేర్పులు, మార్పులకు ప్రభుత్వం త్వరలో అవకాశం కల్పించనుంది. అందుకోసం ప్రస్తుతం ఉన్న తెల్లరేషన్ కార్డుదారులకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి చేసింది. ఈ నెల 31లోగా ఈ ప్రక్రియ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించింది. దీని వలన రేషన్‌లో అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. సాధారణంగా కార్డుదారుల కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు వేలిముద్ర వేసి ప్రతినెలా రేషన్ తీసుకుంటున్నారు. మిగిలిన సభ్యుల్లో కొందరు చదవులు, ఉద్యోగాలు, ఇతర పనుల నిమిత్తం వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. అటువంటి వారి వేలిముద్రలు అప్‌డేట్ కాలేదు. దీంతో ప్రస్తుతం తెల్లరేషన్ కార్డు ఉన్న కుటుంబంలోని అలాంటి సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునేలా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా 6,71,803 రేషన్‌కార్డులు ఉండగా 19,39,082 మంది సభ్యులు ఉన్నారు. అందులో ఇప్పటివరకు 17లక్షల మంది ఈకేవైసీ చేయించుకోగా, మరో (మిగతా 6వ పేజీలో..)



దేశవానిపేట రేషన్ షాపులో ఈకేవైసీ పక్రియ చేపడుతున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీటీ రామకృష్ణ తదితరులు

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

- ఒక్కరోజులోనే 300 మంది విద్యార్థినులతో రిజిస్ట్రేషన్

7లో

అనధికార ఇసుక ర్యాంప్ సీజ్

8 లో

వివాహమైన 50 రోజులకే...

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

8 లో



కళను బతికిస్తూ...

- రంగస్థలంపై రాణిస్తున్న సిక్కోలు కళాకారులు
- సినిమాల్లోనూ విభిన్న పాత్రలతో గుర్తింపు

6 లో



పద్మనాభపురం శనీశ్వర ఆలయం వెనుక కంకర తవ్వకాలు ఇలా..

తవ్వుకుంటాం.. దండుకుంటాం!

- పలాసలో రెచ్చిపోతున్న మట్టి, కంకర మాఫియా
- రాత్రివేళ యథేచ్ఛగా తవ్వకాలు.. తరలింపు

పలాస, మార్చి 26(ఆంధ్రజ్యోతి):

పలాసలో కంకర, మట్టి మాఫియా మళ్లీ పెరిగిపోతుంది. రాత్రి 11 గంటలైతే చాలు ఎక్స్‌కవేటర్లు, భారీట్రిప్పర్లు, ట్రాక్టర్లు.. కంకర, మట్టి కోసం క్యూ కడుతున్నాయి. ఏ ప్రభుత్వం వచ్చినా ఈ మాఫియా తవ్వకాలు యథాతథంగా సాగుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మారినా.. తమ తీరు మారదంటూ అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతుండడం చర్చనీయాంశం అవుతోంది. పలాసకు సమీపంలో కంబిరిగాం, కేదారిపురం ప్రాంతాల్లో మట్టిని అర్ధరాత్రి వరకూ తవ్వకాలు సాగిస్తు న్నారు. పొలాల దిగువన ఇండియన్ ఆయిల్ కంపెనీ (ఐఓసీ)కి చెందిన పైపులైన్లు ఉండడంతో ఆ ప్రాంతం లో తవ్వకాలు నిషేధం. కానీ మాఫియా యథేచ్ఛగా టన్నుల కొద్దీ మట్టిని తవ్వేస్తోంది. రెండు రోజులుగా తవ్వకాలు జోరందుకోవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఐఓసీ అధికారులు కూడా తమ పైపులైన్లకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం మట్టి మాఫి యా ఆగడాలు ఏ విధంగా ఉన్నాయో అర్థమవుతోంది. ట్రిప్పర్‌లో 30 టన్నుల వరకూ మట్టిని లోడ్ చేస్తున్నా రు. ఇలా రోజుకు పది నుంచి 15 ట్రిప్పర్ల మట్టి తరలిపోతుంది. ఇటుకల తయారీ, పునాదుల్లో నింపేందుకు దీన్ని వినియోగిస్తున్నారు. పలాస-కాశీబుగ్గకు చెందిన ఓ వ్యక్తి ఇటుకల బట్టీలకు మట్టిని సరఫరా చేసేందుకు కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఒక్కో ట్రిప్పర్ రూ.15వేల నుంచి రూ.20వేల వరకూ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ ప్రాంతంలో 20కు పైగా ఇటుకబట్టీలు ఉండగా మొత్తం కంబిరిగాం, కేదారిపురం గ్రామాల సరిహద్దుల నుంచే మట్టి రవాణా అవుతోంది.

కంకరనూ వదలని అక్రమార్కులు:

కంకర తవ్వకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. పద్మ నాభపురం కాలనీకి సమీపాన శనీశ్వర ఆలయం వెనుక భా గంలో ఉన్న కంకర కొండంతా ఇప్పటికే సగానికి పైగా తవ్వి సొమ్ము చేసుకున్నారు. 30 సంవత్సరాల కిందట ప్రభుత్వ భూములుగా ఉన్న (మిగతా 6వ పేజీలో..)



కంబిరిగాం వద్ద పొలాల్లో ఏడు అడుగుల మేర మట్టి తవ్వకాలు



పంట పొలాలుగా మారిన మర్రిపాడు కొత్తచెరువు

ఇక్కడో చెరువుండేది!

- ఇప్పుడు గట్టు మాత్రమే మిగిలింది
- షలంత్రిలో 9 ఎకరాల చెరువు ఆక్రమణ
- 'మీ కోసం'లో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

సరుబుజ్జిలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలం షలంత్రి పంచాయతీ మర్రిపాడు రెవెన్యూ గ్రామ పరిధిలో ఒకప్పుడు ఉన్న కొత్తచెరువు ఇప్పుడు మాయమైంది. ఈ చెరువు స్థా నంలో పొలాలు వెలిశాయి. చెరువంతా ఆక్రమణకు గురై కేవలం గట్టు మాత్రమే మిగిలింది. దీంతో ఆయకట్టుదారుల కు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. మర్రిపాడు గ్రామ రెవెన్యూ సర్వే నెంబ ర్ 32/3సీలో సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో గతంలో కొత్త చెరువు ఉండేది. ఈ చెరువు నీటిపై ఆధార పడి దిగువున ఉన్న సుమారు 40 ఎకరాల ఆయ కట్టు రైతులు ఖరీఫ్, రబీలో పంటలను సాగు చేసేవారు. అయితే, దీనికి ఆనించి ఉన్న కొంతమంది రైతులు పూర్తిగా చెరువును ఆక్రమించుకొని పంట పొలాలుగా మార్చేశారు. కేవలం గట్టు మాత్రమే మిగిలాయి. దీంతో సాగునీరు అంద క ఆయకట్టుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 17న మూల సవలాపురం సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు 'మీ కోసం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న జేసీ.. స్థానిక తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. దీనిపై రెవెన్యూ సిబ్బంది నామమాత్రపు విచారణ జరి పారని, ఎటువంటి ఆక్రమణలు తొల గించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త చెరువు ఆక్రమణలు తొలగించాలని, లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పేర్కొంటున్నారు.

ఇంటర్ కొత్త సిలబస్

- నీట్, జేఈఈ పరీక్షలకు అనువుగా..
- గణితం, బయాలజీలో ఒక్కొక్క పేపర్
- ప్రశ్నపత్రం నమూనా విడుదల
- ఈ ఏడాది నుంచి అమలుకు సన్నాహాలు

నరసన్నపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి):

ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం.. ఈ ఏడాది నుంచి కొత్త విధానం అమలుకు కసరత్తు ముమ్మరం చేసింది. నీట్, జేఈఈ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేలా సిలబస్‌లో మార్పులు చేసింది. ఈమేరకు 2025-26 విద్యాసంవత్సరం చెందిన సిలబస్, ప్రశ్నపత్రాల కూర్పు, అకాడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృత్తికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తరగతులు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అకాడమిక్ సంవత్సరంలో 314 రోజులకు గాను 235 రోజులు పనిదినాలు 79 దినాలు సెలవులుగా పరిగణిస్తూ షెడ్యూల్ విడుదల చేశారు.

- ఏప్రిల్ 24 నుంచి- జూన్ ఒకటో తేదీ వరకు వేసవి సెలవులు. జూన్ 2న కళాశాలలు తెరవనున్నారు. జూలై 17 నుంచి 19 వరకు యూనిట్ -1 పరీక్షలు, ఆగస్టు 18 నుంచి 20 వరకు యూనిట్-2, సెప్టెంబరు 15 నుంచి 20 వరకు క్వార్టర్లీ పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేశారు.
- సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 5 వరకు దసరా సెలవులు. అక్టోబరు 22 నుంచి 24 వరకు యూనిట్ -3 పరీక్షలు, నవంబరు 17 నుంచి 22 వరకు అర్ధ సంవత్సర పరీక్షలు, జనవరి 15 నుంచి 20వరకు ప్రీఫైనల్-1 పరీక్షలు నిర్వహిస్తారు.
- జనవరి 10 నుంచి 18 వరకు సంక్రాంతి సెలవులు. జనవరి 21 నుంచి 28 వరకు ప్రీఫైనల్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఫిబ్రవరిలో ప్రాక్టికల్స్ ఫిబ్రవరి-మార్చిలో థియరీ పరీక్షలు నిర్వహించి.. మార్చి 18న ఇంటర్ అకాడమిక్ ఇయర్ ముగుస్తుంది.

● సిలబస్ ఇలా..

గతంలో గణితం-ఏ, బీ రెండు పేపర్లు ఉండగా.. ఈఏడాది నుంచి ఒకే పేపర్‌గా మార్పు చేశారు. మొత్తం 14 యూనిట్లుగా విభజించారు. ఫిజిక్స్‌లో 14 యూనిట్లు, కెమిస్ట్రీలో 9 యూనిట్లు సిలబస్ పొందుపరిచారు. ఇక బోటనీ, జువాలజీలను కలిపి బయాలజీగా మొత్తంగా ఏడు యూనిట్లు, 19 చాప్టర్లను రూపొందించారు. ఇందులో బోటనీ నాలుగు యూనిట్స్‌లో 10 చాప్టర్లు, జువాలజీలో 3 యూనిట్లు 9 చాప్టర్లు ఉంటాయి. సివిక్స్‌లో 12 చాప్టర్లు, హిస్టరీ 12 చాప్టర్లు, ఎకానమిక్స్ 9 చాప్టర్లు, కామర్స్‌లో థియరీలో మూడు యూనిట్లు, అకౌంటింగ్‌లో 5యూనిట్లు ఉన్నాయి. అలాగే కొత్తగా తెలుగు, ఇంగ్లిషు, సంస్కృతం, హిందీ తదితర సబ్జెక్టుల సిలబస్‌ను విడుదల చేశారు.



● ప్రశ్నల కూర్పులో మార్పు..

ఈ ఏడాది నుంచి ప్రశ్నపత్రాల కూర్పులో మార్పు చేశారు. గణితంలో ఒక మార్కు ప్రశ్నలు 12, రెండు మార్కులు ప్రశ్నలు 10, నాలుగు మార్కులు ప్రశ్నలు ఏడు, 8 మార్కులు ప్రశ్నలు 5 రాయాల్సి ఉంటుంది. నాలుగు, 8 మార్కులు ప్రశ్నలకు చాయిస్ ఇచ్చారు. ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీలో ఒక మార్కు ప్రశ్నలు తొమ్మిది, రెండు మార్కుల ప్రశ్నలు 14, నాలుగు మార్కుల ప్రశ్నలు ఎనిమిది, ఎనిమిది మార్కులు ప్రశ్నలు రెండు రాయాలి. ఇక్కడ కూడా నాలుగు, 8 మార్కు ప్రశ్నలకు మాత్రమే చాయిస్ ఇచ్చారు.

- బయాలజీలో బోటనీకు 43 మార్కులు, జువాలజీకు 42 మార్కులు కేటాయించారు. ఒక మార్కు ప్రశ్నలు 9, రెండు మార్కులు ప్రశ్నలు 14, నాలుగు (మిగతా 6వ పేజీలో..)

ప్రభుత్వ లేఅవుట్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారు?

- సుడా అధికారులను ప్రశ్నించిన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

పలాస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లేఅవుట్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సుడా అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఆయన పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న సుడా లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రూ.76కోట్ల వ్యయంతో మొత్తం 1700 ప్లాట్లు వేస్తున్నాం. దీన్ని ప్రభుత్వ ఆధీనంలోనే నిబంధనల మేరకు అమ్మకాలు చేస్తారు. లేఅవుట్‌ను ఎప్పుడు పూర్తిచేస్తారు. దీనికి సంబంధించిన భూసమస్యలు ఏవైనా ఉన్నాయా?' అని ప్రశ్నించారు. 16 సెంట్లలో సమస్య ఉందని అధికారులు చెప్పగా.. తక్షణమే పరిష్కరించి సుడాకు కేటాయించాలని తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తికి జేసీ ఆదేశించారు. రోడ్లు, గోతులు పూడ్చడానికి కంకర ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. 152 ఎకరాల భూమిని కొనుగోలు చేసి రైతులకు పరిహారంగా రూ.22కోట్లు చెల్లించామన్నారు. లేఅవుట్‌లో ప్రధాన రహదారి 80అడుగుల వెడల్పు, మిగిలిన ప్రాంతాల్లో 40 అడుగుల వెడల్పుతో రోడ్లు వేస్తామని తెలిపారు. కాలువలు, తాగు నీటి వసతి, మొత్తం నాలుగు పార్కులు, సెంటర్ లైటింగ్, ఆటస్థలాలు ఏర్పాటు చేస్తామన్నారు. నీటిని వృథా చేయకుండా రీసైకిలింగ్ చేసి మొక్కల పెంపకానికి వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ సుగుణాకర్, ఆర్డీవో జి.వెంకటేష్, డీఈఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్, సుడా సిబ్బంది పాల్గొన్నారు.



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్అహ్మద్‌ఖాన్

కళను బతికిస్తూ..

నేడు ప్రపంచ నాటక దినోత్సవం



కొడుకు పుట్టాల నాటికలో సన్నివేశం

కళలు.. కళాకారులకు నిలయమైన శ్రీకాకుళం జిల్లా ఎంతోమంది నటులను నాటక రంగానికి అందించింది. వీరిలో సినిమాల్లో రాణించిన వారు... ప్రస్తుతం చిత్ర సీమలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. వివిధ నాటికల్లో విభిన్న పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటులూ ఉన్నారు. కొన్నాళ్ల పాటు నాటక రంగానికి ఆదరణ తగ్గినప్పటికీ.. ఇటీవల కాలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాటిక పోటీలు నిర్వహిస్తూ... కళాకారులను ప్రోత్సహించడంతో నాటక రంగం పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● రంగస్థలంపై రాణిస్తున్న సిక్కోలు కళాకారులు ● సినిమాల్లోనూ విభిన్న పాత్రలతో గుర్తింపు

నాటకాలతో పురస్కారాలు..

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అటు నటుడిగా... ఇటు నాటక దర్శకుడిగా గుర్తింపు పొందారు రామలింగస్వామి. 1967లో తొలిసారి 'విముక్తుడు' నాటికకు దర్శకత్వం వహించారు. ఇప్పటి వరకు ఎన్నో నాటకాలు, నాటికలలో నటించడంతో పాటు దర్శకత్వం వహించారాయన. భిలాయ్ ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్తు, విశాఖపట్నం కె.వి.మెమోరియల్, కళాజగతి సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య అనే సంస్థను 1978లో ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైనా... ప్రవృత్తి రీత్యా నటుడిగా, దర్శకుడిగా పేరు పొందారు.



శ్రీకాకుళంలో ప్రదర్శించిన నాటికలో...



పేడాడను సత్కరిస్తున్న తాజా, మాజీ కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, కృపారాణి, ఎమ్మెల్యే రవికుమార్ (ఫైల్)

నాటక రచన.. నటనతో
జాతీయ స్థాయిలో గుర్తింపు

● ఇదీ పేడాడ ప్రతిభ

టెక్కలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని నాటికలు రచించడం.. వాటిలో నటించడం ద్వారా గుర్తింపు పొందారు టెక్కలికి చెందిన డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు. ఆయన నటించిన 'పక్షి' నాటికకు 1992లో న్యూఢిల్లీ సాహితీ సమ్మేళన్ వారి ఉత్తమ రచయితగా అవార్డును అందుకున్నారు. పక్షి, త్యాగమూర్తులు, నిషేధం, భగత్‌సింగ్ వంటి నాటికలతో రచయితగా మంచి గుర్తింపు పొందారు. ఆయన నాటికల్లో ఎక్కువగా శ్రీకాకుళం జిల్లా మాండలికానికి పెద్ద పీట వేస్తుంటారు. అతిథి దేవుళ్లు వస్తున్నారు, అసుర సంధ్య, న్యాయం కార్చిన రక్తం చుక్కలు, వల, భగత్‌సింగ్ వంటి అనేక నాటికలతో నటుడిగానూ అవార్డులు, ప్రశంసలు అందుకున్నారు. పేడాడ రచించిన 'పక్షి' నాటికకు ప్రముఖ సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ముందుమాట రాశారు. తేలినీలాపురంలో గల విదేశీ విహంగాలను ఉద్దేశించి నాటికలో పాత్రలు సృష్టించారు. ఈ దేశంలో విదేశీ పక్షులకు ఉన్న విలువ పేదలకు ఎక్కడ ఉంది అంటూ ప్రశ్నించిన 'పక్షి' నాటిక అప్పట్లో అనేక పరిషత్‌లలో బహుమతులను సాధించింది. రాష్ట్రంలో అక్షరాస్యత ఉద్యమానికి దన్నుగా రచించిన 'త్యాగమూర్తులు' నాటికను అన్ని వయోజన అక్షరాస్యత కేంద్రాల్లో ప్రదర్శించాలని అప్పటి కలెక్టర్ అనిల్‌చంద్ర పునేఠా ఆదేశాలిచ్చారు. నంది అవార్డులను రద్దు చేయడం చాలా చిన్నపనిగా గత ప్రభుత్వానికి తోచినా అది పెద్ద ప్రగతిశీల అడ్డంకి అని అన్నారు. పరిషత్‌లు బతికినంత కాలం నాటిక బతుకుతుందని అన్నారు. నాటకం దారా సామాజిక చైతన్యాన్ని సాధించవచ్చునన్నారు.

నాటకాలలో కుమార్ 'నాయక్'

పలాస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో కళల గురించి తెలిసిన వారికి కుమార్ నాయక్ పేరు పరిచయం చేయనవసరం లేదు. ఉద్యోగరీత్యా హాస్టల్ వార్డెన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఇటీవల నంది బహుమతి పొందడంతో పాటు గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకున్నారు. మొదటిసారిగా 1976లో 'రైతు సమస్య' నాటికను ప్రదర్శించారు. 1981 'కొడుకే పుట్టాలా' అనే నాటికకు ఉత్తమ నటుడిగా అప్పటి కలెక్టర్ బి.డి.దానం నుంచి అవార్డును అందుకున్నారు. 2018లో పొద్దుటూరులో 1111 మంది కళాకారులతో కళారూపం ప్రదర్శించినందుకు భారత్ బుక్, ఆంధ్రా బుక్ రికార్డుల్లో ఆయన పేరు నమోదైంది. 2023లో అరుణాచలంలో 999 మంది కళాకారులతో కోలాటం ప్రదర్శనకు గాను తానా బుక్ ఆఫ్ రికార్డులలో చోటు దక్కించుకున్నారు. 2024లో తాడేపల్లిగూడెంలో ప్రదర్శించిన ఆలితిప్పలు, దుర్దశ నాటికలో ప్రదర్శనకు గాను అమేజింగ్ వరల్డ్‌రికార్డు, మార్వెల్ బుక్ ఆఫ్ రికార్డులలో పేరు నమోదు చేసుకున్నారు.



గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్ (ఫైల్)

ఉద్దానానికి గుర్తింపు తెస్తూ..

కంచిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం కత్తివరం గ్రామానికి చెందిన బెందాళం శోభన్‌బాబు, బెందాళం రాజేష్‌లు తమ ప్రతిభతో జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయి నాటిక పోటీలలో అనేక అవార్డులను, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి రివార్డులను అందుకున్నారు. వీరితో పాటు బి.గొనపపుట్టుగ గ్రామానికి చెందిన శమళ్ల సర్వేశ్వరరావు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక ప్రదర్శనలు ఇచ్చి విమర్శకుల ప్రశంసలతోపాటు అవార్డులు గెలుచుకున్నారు. ప్రతినాయకుడిగా 'నిర్జీవ నినాదం'లో వేసిన పాత్రకు ఉత్తమ నటుడి పురస్కారం లభించింది. నంది నాటకోత్సవాల్లోనూ పాల్గొన్నారు. భిలాయ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతినాయకుడిగా అవార్డు అందుకున్నారు. అదే గ్రామానికి చెందిన పిరియా చలపతిరావు ఇప్పటి వరకు వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. 'కాటు' అనే సాంఘిక నాటకాన్ని రికార్డు స్థాయిలో 140 సార్లు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. బొరివంకలో శార్వాణి సంస్థను స్థాపించి వివిధ జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. రెండు పర్యాయాలు నంది నాటక పురస్కారాలు అందుకున్నారు.



బహుమతి అందుకుంటున్న చలపతిరావు, సర్వేశ్వరరావు, శోభన్ తదితరులు (ఫైల్)

ఇటు నాటికలు.. అటు ఏకపాత్రలు

నందిగాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మాయల పకీరు పాత్రతో భయపెడతాడు... సుయోధనుడిగా 'మయసభ'లో తన నటన, సంభాషణలతో అలరిస్తాడు నందిగాం గ్రామ పురోహితుడు రేజేటి బోసుబాబు. ఎటువంటి పాత్రనైనా అవలీలగా పోషించే నటుడిగా గుర్తింపు పొందారాయన జాతీయ స్థాయి పోటీల్లో అనేక అవార్డులు అందుకున్నారు బోసుబోబు. స్వగ్రామం వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి అయినప్పటికీ పౌరోహిత్యం వృత్తిరీత్యా నందిగాం వాసిగానే అందరికీ పరిచయం. సినిమాలతో పాటు నాటికలు, టీవీ సీరియల్స్‌లో కూడా వివిధ పాత్రలు పోషించి... మంచినటుడిగా పేరు సంపాదించారు. భిలాయ్, తెనాలి తదితర ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయిలో నాటికల్లో అనేక పాత్రలు పోషించి అవార్డులు సొంతం చేసుకున్నారు. 'మతమా.. మానవత్వమా' అనే నాటికలో నటనకు గాను అనేక అవార్డులు సొంతం చేసుకున్నారు. నాటక, సినిమా, టీవీ రంగాల్లో పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులు గెలుచుకున్నారు. సినీనటుడు ఆర్.నారాయణమూర్తితో కలసి అమ్మమీద ఒట్టు, అడవిబిడ్డలు నాటికలతో పాటు వివిధ సీరియళ్లలోనూ నటించాడు బోసుబోబు. కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని మంచి ప్రదర్శనలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని బోసుబాబు అభిప్రాయపడ్డారు.



తెనాలిలో జాతీయస్థాయి నాటిక పోటీల్లో అవార్డు అందుకుంటున్న బోసుబాబు (ఫైల్)

రంగస్థలంపై వెలుగుతున్న 'జ్యోతి'

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నాటక రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు శ్రీకాకుళానికి చెందిన నటి జ్యోతి. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో జన్మించిన జ్యోతి ప్రసన్న తండ్రి మన రాష్ట్రంలోని ఇచ్ఛాపురం వచ్చి స్థిరపడ్డారు. ఆయన ఒకప్పుడు చిన్నచిన్న కామెడీ షోలు చేసేవారు. బొరివంక కళా సమాఖ్య వారు ప్రదర్శించిన 'రక్త తుఫాన్' అనే సాంఘిక నాటిక ద్వారా జ్యోతి రంగస్థలంపై కాలుమోపారు. అనంతరం కథానాయకుడు, పల్లె పడుచు, జీవనజ్యోతి, ఆడబ్రతుకు, కన్నీటి కాపురం, కొడుకు పుట్టాల, వీధి నాటకం ఇలా 70 వరకు సాంఘిక నాటికలు, నాటకాలలో వివిధ పాత్రలు పోషించారు. ఎన్.పి.ప్రసాద్ దర్శకత్వంలో 'పక్షి' అనే సాంఘిక నాటికలో ఆమె ప్రదర్శించిన నటనకు ఉత్తమ నటిగా బహుమతి అందుకున్నారు. ఈ నాటికతో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలలోనూ మంచి పేరు సంపాదించుకున్నారు. ఈ నాటికను రవీంద్రభారతిలో ప్రదర్శించి... అనేక మంది ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఢిల్లీలో పక్షి, చైత్రంలో శిశిరం అనే సాంఘిక నాటికలను ప్రదర్శించారు. అనిల్ చంద్ర పునేఠా కలెక్టర్‌గా ఉన్న సమయంలో అక్షర క్రాంతి, మూఢనమ్మకాలు, వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన వ్యాధులపై వివిధ ప్రాంతాల్లో బుర్రకథల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తనకు పింఛనుతో పాటు ఓ ఇంటిని మంజూరు చేసిందని తెలిపారు జ్యోతి. యాంకర్ సుమ ప్రధాన పాత్రలో నటించిన 'జయమ్మ పంచాయతీ' సినిమాలోనూ జ్యోతి నటించారు. తన నటనతో అనేక అవార్డులు అందుకున్న జ్యోతి ఇప్పటికీ వివిధ నాటక సమాజాలతో కలసి పరిషత్‌లలో పాల్గొంటూ కళాకారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

జిల్లాలో కెమికల్ ఇంజనీర్లకు డిమాండ్

(ఐదో పేజీ తరువాయి)

ప్రగతి సాధించడానికి ఉన్న అవకాశాలను వినియోగించుకోబోతున్నాం. అరసవల్లి, శ్రీకూర్మం క్షేత్రాలతోపాటు పర్యాటక పరంగా జిల్లాను అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగులందరికీ కూడా 'ఏ.ఐ' (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ వినియోగంపై ప్రత్యేకంగా శిక్షణ నిర్వహిస్తున్నాం. ప్రతి మూడు నెలలకోసారి 200 మంది ఉద్యోగులకు ఈ శిక్షణ అందిస్తామ'ని స్పష్టం చేశారు.

● 'తలసరి' ఎందుకు తగ్గుతోంది?

శ్రీకాకుళం జిల్లా ప్రజల తలసరి ఆదాయం ఎందుకు తగ్గుతోందంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు సీఎం చంద్రబాబు చిన్నపాటి క్లాస్ పీకారు. "తలసరి ఆదాయంలో శ్రీకాకుళం వెనుకబడిపోయింది. ఈ సమస్య ఎందుకొచ్చింది. సులభమైనవాటి గురించి మాట్లాడి వెళ్లిపోతే సమస్యలు పరిష్కారం కావు. జిల్లాస్థాయిలో చర్చించకుండా ఇక్కడ ఈజీ సొల్యూషన్స్ చెబితే ఫలితాలు రావు. ఇన్ని రోజుల నుంచి ఏమి చేశారు. ఎవరితో మాట్లాడారు?" అంటూ మంత్రి శ్రీనివాస్‌ను సీఎం ప్రశ్నించారు.

● అమ్మా నీ హామీలు నాకు వద్దు..

సమావేశంలో మంత్రి అనిత మాట్లాడుతూ 'తోటపల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలి. జీఎస్‌డీపీలో జిల్లా నుంచి రాష్ట్రానికి కాంట్రిబ్యూషన్ ఇస్తామని సీఎంకి హామీ ఇస్తున్నాను' అని వెల్లడించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కలుగజేసుకుని.. "అమ్మా నీ హామీలు నాకు వద్దు. ఏదైనా ఉంటే చేతల్లో చూపించు. మాటలు వద్దు. ఇది మీ పనితీరు అని రిపోర్ట్ చెబుతోంది. నాకంతా 'రా' మెటీరియల్ ఇస్తున్నారు. ప్రతి ఒక్కరినీ ఎక్స్‌రే చేయగలగాలి. మీ సలహాలు వద్దు. తొమ్మిది నెలలు గడిచిపోయింది. మీ ప్రోగ్రెస్ లెక్కలు ఇక్కడ ఉన్నాయి" అంటూ ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఇచ్ఛాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి కృష్ణశిల విగ్రహ ప్రతిష్ఠ ఆరో వార్షికోత్సవం సందర్భంగా వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి, నాట్య గురువు శృతిపట్నాయక్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

తవ్వుకుంటాం.. దండుకుంటాం!

(ఐదో పేజీ తరువాయి)

ఈ స్థలంలో 16 మంది వ్యక్తులకు పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఎటువంటి నిర్మాణాలు చేసుకోలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఉన్న కంకర మొత్తం తవ్వేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకూ అమ్ముతున్నారు. గతంలో ఇక్కడ కంకర తవ్వకాలు జరిగినపుడు అధికారులు అడ్డుకొని కేసులు నమోదు చేయడంతో తవ్వకాలు ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారి తొమ్మిది నెలలు కావడంతో కంకర, మట్టి మాఫియా సభ్యులు తెగబడుతున్నారు. మాఫియాపై అధికారులకు సోమవారం రాత్రి స్థానిక ప్రజలు ఫోన్ చేసి సమాచారం అందించారు. అర్ధరాత్రి పోలీసుల సహకారం లేకపోవడంతో ఆ ప్రాంతానికి వెళ్లలేకపోయారు. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారుల బృందం వెళ్లి పరిశీలించినపుడు అప్పటికే విలువైన మట్టి, కంకర తరలిపోయింది. రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఈ మాఫియా ఆగడాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ వ్యవహారంపై తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి వద్ద ప్రస్తావించగా.. కంకర, మట్టి తవ్వకాల విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అక్రమార్కులపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

మూడు టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

అక్రమంగా మట్టి తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కేదారిపురం, కంబిరిగాం గ్రామాల వద్ద పొలాల్లో మట్టిని తవ్వుతుండగా తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో సిబ్బంది, కాశీబుగ్గ పోలీసులు దాడులు చేసి మూడు టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి నుంచి రూ.60 వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. బుధవారం వాటికి నిబంధల మేరకు అపరాధ రుసుం విధించి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టకూడదని, దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



టిప్పర్ల డ్రైవర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి



పొలాల్లో తిష్ఠవేసిన ఏనుగులు (ఫైల్)

25 ఎకరాలలో పంట నష్టం

● ఆవేదన చెందుతున్న వసప, కుంటిభద్ర రైతులు

● పది రోజుల పాటు కునుకు లేకుండా చేసిన ఏనుగులు

కొత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం వసప, కుంటిభద్ర గ్రామాల్లో 10 రోజుల పాటు ఏనుగులు తిష్ఠ వేసి పంటలను ధ్వంసం చేశాయి. ప్రధానంగా వాణిజ్య పంటలను పాడు చేసిన తరువాత భామిని మండలానికి వెళ్లిపోవడంతో రైతులు ఏమేర పంట నష్టపోయామో తెలుసుకునేందుకు పొలాలు, తోటలకు వెళ్లారు. సుమారు 40 మంది రైతులకు చెందిని 25 ఎకరాల పంట నష్టవాటిల్లినట్లు గుర్తించి లబోదిబోమంటున్నారు. పండించిన పంటలను ఒక్కొక్కరు వెళ్లి చూసి ఏనుగులు పాడుచేశాయని కంటతడిపెట్టుకున్నారు. మామిడితోటలు, చెరకు, మొక్కజొన్న, పుచ్చకాయలు, అరటి పంటలు ధ్వంసమయ్యాయని వాపోతున్నారు. ఇవే కాకుండా మోటార్లను కూడా ఏనుగులు పాడుచేసి తీవ్ర నష్టం కలిగించాయని, అటవీ, హార్టికల్చర్, వ్యవసాయ శాఖల అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఏనుగుల వల్ల పంటలు నష్టపోయింది రైతులమైన అధికారులు కనీసం మా గ్రామాల వైపు చూడలేదని ఆవేదన చెందుతున్నారు. పంటల నష్టం విషయమై కొత్తూరు వ్యవసాయాధికారి స్వర్ణలత వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా ఏనుగుల వల్ల పంటలు నష్టపోయిన రైతులను గుర్తించేందుకు రెవెన్యూ, అటవీ శాఖ సర్వే చేపడతారన్నారు. అటవీశాఖ ద్వారా నివేదికను ఉన్నతాధికారులకు పంపి రైతులకు న్యాయం చేస్తామన్నారు.



ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

యువ పార్లమెంట్ పోటీలకు వర్సిటీ విద్యార్థులు

ఎచ్చెర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యువ పార్లమెంట్ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ యువ పార్లమెంట్-2025 పోటీల్లో ఇటీవల జోనల్ స్థాయిలో విశాఖలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న బీఆర్‌ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థి ఎస్.సాయి ప్రదీప్, కాకినాడ ఆదిత్య కళాశాల (శ్రీకాకుళం)కు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీరు జి.రాజరాజేశ్వరి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఈ నెల 28న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు)లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. వీరిని వీసీ కేఆర్ రజని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డి.వనజ, ఎల్.మోహనరావు, టి.భవాని పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రజని

ఐదు రోజులే!

(ఐదో పేజీ తరువాయి)

రెండు లక్షల మంది నమోదు కాలేదు. ప్రస్తుతం డీలర్ల ద్వారా ఈకేవైసీ ప్రక్రియను చేపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా డీలర్ల వద్ద కార్డుదారులు ఈకేవైసీ చేయించుకునేలా వెసులుబాటు కల్పించారు. అయితే నెలల తరబడి ఈ-పోస్‌లో వేలిముద్రలు వేయనివారు మాత్రమే ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంటుందని పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, గడువు ఐదు రోజులే ఉండడంతో డీలర్ల వద్దకు కార్డుదారులు పరుగులు పెడుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా ప్రక్రియ జాప్యమవుతోంది. ఈకేవైసీ గడువు పెంచాలని పలువురు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయాలి..

రేషన్‌కార్డుదారులు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్‌వో సూర్యప్రకాష్ తెలిపారు. బుధవారం నరసన్నపేటలోని దేశవానిపేట, భవానీపురంలో ఈకేవైసీ నమోదు చేస్తున్న రేషన్ షాపులను పరిశీలించారు. ఈ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. సీఎస్‌డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నమయ్యకు స్వర నీరాజనం

పలాస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి మందిరంలో అన్నమయ్య 522వ వర్ధంతి, ఇటీవల మృతి చెందిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ స్మృత్యంజలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అన్నమయ్య హరిశరణాగతి సమాఖ్య వ్యవస్థాపకుడు వైశ్యరాజు వెంకట రఘురామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది గాయకులు సామూహికంగా కీర్తనలు ఆలపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం గాయలకుతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నమయ్య కీర్తనలను సామూహికంగా ఆలపించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు రఘురామరాజు మాట్లాడుతూ ఏటా అన్నమయ వర్ధంతి సందర్భంగా సామూహిక గళార్చన చేస్తున్నామన్నారు. మందిర కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు, ఎడ్యుకేషనల్ ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, మల్లా శరత్, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సామూహిక అన్నమయ్య గళార్చనలో పాల్గొన్న కళాకారులు

ఇంటర్ కొత్త సిలబస్

(ఐదో పేజీ తరువాయి)

మార్కులు ప్రశ్నలు 4, ఎనిమిది మార్కుల ప్రశ్నలు రెండు కేటాయించారు. అలాగే హిస్టరీ, సివిక్స్, ఎకనామిక్స్‌కు ఒక మార్కు ప్రశ్నలు 10, రెండు మార్కు ప్రశ్నలు 20 ఇస్తారు 15 ప్రశ్నలు రాయాలి. నాలుగు మార్కుల ప్రశ్నలు 14 ఇస్తారు 9 రాయాలి. ఎనిమిది మార్కుల ప్రశ్నలు ఐదు ఇస్తారు.. మూడు రాయాల్సి ఉంటుంది.

● కామర్స్‌లో ఒక మార్కు ప్రశ్నలు 8, రెండు మార్కుల ప్రశ్నలు 20 ఇస్తారు.. 14 రాయాలి. నాలుగు మార్కులు ప్రశ్నలు పది ఇస్తారు.. నాలుగు రాయాల్సి ఉంటుంది. ఏనిమిది మార్కుల ప్రశ్నలు 5 ఇస్తారు మూడు రాయాలి. 16 మార్కులకు అకౌంటింగ్ నుంచి ఒక ప్రశ్న వస్తుంది. దీనికి చాయిస్ లేదు. ఇంగ్లిషులో అర మార్కు, ఒక మార్కు, 2 మార్కు, 5 మార్కులు, 8 మార్కుల ప్రశ్నలు, గ్రామర్, బిట్స్ ఇస్తారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ ప్రశ్నపత్రాలు కూర్పు చేయాల్సి ఉంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటి తక్షణ పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. స్థానిక విశాఖ-ఏ కోలనీలో గల తన కార్యాలయంలో ఆయన బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి, నియోజకవర్గంలోని ప్రజల నుండి వివిధ సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికే అధిక ప్రాధాన్యత అని, అధికారులతో వెంటనే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గార, శ్రీకాకుళం మండలాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు ఎమ్మెల్యేకు వినతు లను అందజేశారు.


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

బాడీ బిల్డింగ్‌లో క్రీడాకారుడి సత్తా

శ్రీకాకుళం స్పోర్ట్స్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా చల్లపేట గ్రామానికి చెందిన ఎస్.వైకుంఠరావు 60 కిలోల విభాగంలో నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే శంకర్‌ను ఆయన కలుసు కున్నారు. ఈ సందర్భంగా వైకుంఠరావును ప్రత్యేకంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రసాద్, కార్యదర్శి వి.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షకు 173 మంది గైర్హాజరు

గుజరాతీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు 173 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం ఫిజిక్స్ పరీక్ష నిర్వహించగా, రెగ్యులర్‌కు సంబంధించి 28,276 మందికిగాను 28,149 మంది విద్యార్థులు హాజరు కాగా, 127మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్‌కు సంబంధించి 494 మందికిగాను 448 మంది హాజరు కాగా 46 మంది హాజరు కాలేదు.

ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న ఉపాధ్యాయులు

గుజరాతీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందన్న అభియోగంతో 14 మంది ఉపాధ్యాయులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. నగరంలోని డీఈవో కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చౌదరి రవీంద్ర, మజ్జి మదన్‌మోహన్, తంగి మురళి, జి.రమణ, ఎస్.కిషోర్‌కుమార్, పి.కృష్ణారావు, బి.రవి. ఎస్.రమేష్‌బాబు, ఎస్.సత్యంనారాయణ, బి.ధనుంజయ్ బి.రమేష్ పాల్గొన్నారు.

యోగా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గుజరాతీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రధానమంత్రి యోగా అవార్డులు -2025 కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ అవార్డులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి యోగా అభివృద్ధి, యోగా ప్రచారానికి అత్యుత్తమ సహకారం అందించిన వారు, యోగా అభివృద్ధికి విశేష కృషిచేసిన వారై ఉండాలన్నారు. ఈ నెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు..

అరసవల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్న విషయం తెలిసిందే. టెట్ పరీక్షలో అర్హత సాధించిన జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి ఉచిత దరఖాస్తులను ఈ నెల 31వ తేదీన స్వీకరిస్తున్నట్టు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనూరాధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో శ్రీకాకుళంలో గల 80 అడుగుల రోడ్డులో ఉన్న ఏపీ బీసీ స్టడీ సర్కిల్, శ్రీకాకుళం కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా..

గుజరాతీపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మూడు నెలల పాటు ఉచితంగా డీఎస్సీ శిక్షణ తీసుకునేందుకు దరఖాస్తు చేసుకున్నవారి జాబితాను విడుదల చేసినట్టు కలెక్టరేట్ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపిక కానివారు ఫేజ్-2లో కోచింగ్ సెంటర్‌లను ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీలోగా ఆప్షన్స్ ఇచ్చుకోవాలన్నారు.

వేలం పాట ఖరారు

ఇచ్ఛాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మూడోసారి జరిగిన మున్సిపల్ వేలం పాట కొలిక్కివచ్చాయి. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వీధిగుత్త, డైలీ మార్కెట్ ఆశీలు, కమేళా, పాత పేపర్లకు సంబంధించిన వేలం పాటలు నిర్వహించారు. డైలీ మార్కెట్, వీధిగుత్త ఆశీలు రూ.28,47,340, కమేళాకు రూ.1,92,930 చొప్పున కె.రాజు పాటను దక్కించుకున్నాడు. పాత పేపర్లు రూ.5,500, కొబ్బరిచెట్ల ఫలసాయం రూ.4,100కు రాజు పాడుకున్నాడు. ఈ నెలాఖరులో జరిగే మున్సిపల్ సాధారణ సమావేశంలో చర్చించి ఖరారు చేయనున్నట్టు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పాటదారులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న కౌన్సిలర్

ఇచ్ఛాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి 11వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం రామయ్యపుట్టుగలో ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వార్డు పరిధిలో గల బొబ్బిలివీధి, రంగాలవీధి, కొయ్యివీధి, బుగతవీధి, గౌడవీధి, జాలరవీధి, మహంతివీధి, కోటవీధి, సయ్యఖాన్ వీధి, ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వార్డులో ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్వో, అటెండర్లగా ప్రయోషన్ చేయాలని, కొన్నేళ్లగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వీఏఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను బుధవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన వీఆర్‌ఏల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని కోరుతూ వచ్చే నెల 5న విజయవాడలో నిర్వహిస్తున్న సదస్సుకు వీఆర్‌ఏలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ జిల్లా నాయకులు ఎన్.సీతప్పుడు, డి.అప్పారావు, కె.పురుషోత్తం, రాములమ్మ, మీనాక్షి, రాజారావు, లోకనాథం, శంకర్, బొమ్మాళి వెంకటరమణ, రామ్మూర్తి, లక్ష్మణరావు, ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక


మాట్లాడుతున్న పీడీ సుధాకర్

రణస్థలం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకానికి సంబంధించిన వివిధ పనుల్లో రూ.1,26,000 అవకతవకలు జరిగినట్టు సంబంధిత అధికారులు గుర్తించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పీడీ బి.సుధాకర్ అధ్యక్షతన ప్రజావేదిక జరిగింది. దేరసాం, సంచాం, మెంటాడ, ఎర్రవరం, నెలివాడ, మరువాడ తదితర గ్రామాల్లో వేసిన మొక్కలు చనిపోయినట్లు, కొన్ని గ్రామాల్లో మస్టర్లపై కొన్ని సంతకాలు లేనట్లు గుర్తించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ఆర్.స్వరూపరాణి, ఏపీడీలు శైలజ, లోకేష్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు పిన్నింటి సాయికుమార్ పాల్గొన్నారు.

రబీలో రూ.650కోట్ల రుణాలు


మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో సత్యనారాయణ

అరసవల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకులకు ధీటుగా శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పని చేస్తుందని డీసీసీబీ సీఈవో దత్తి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని సహకార బ్యాంకులు శతశాతం కంప్యూటరీకరణ చేయడం జరుగుతోందన్నారు. ఈ నెలాఖరు నాటికి జిల్లాలోని 42 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు అన్నింటి నీ కంప్యూటరీకరణ చేశామని, దీనివలన అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. ప్రస్తుత రబీ సీజన్లో జిల్లాలో రూ.650 కోట్ల పంట రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. అన్ని రకాల రుణాలు కేంద్ర సహకార బ్యాంకు ద్వారా మంజూరు చేస్తున్నామని, వ్యవసాయ రంగానికి ధీటుగా వ్యవసాయేతర రంగాలకు కూడా రుణాలు ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఒక మోడల్ బ్యాంకుగా తీర్చిదిద్దడమే ప్రథమ కర్తవ్యమన్నారు. తొలుత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు బ్యాంకు సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ వరప్రసాద్, ఇతర బ్యాంకు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ ఆశీల వేలం వాయిదా

ఆమదాలవలస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో సంవత్సరం కాలం పట్టణ ఆశీల వసూళ్లతో పాటు కమేళా ఆశీల వసూళ్లకు నిర్వహించిన వేలం పాటను వాయిదా వేస్తున్నట్టు మున్సిపాల్ మేనేజర్ బిషోయ్ ప్రకటించారు. బుధవారం ఉదయం పదిన్నర గంటలకు పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ మేనేజర్ బిషోయ్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు వేలం పాట నిర్వహించారు. పట్టణ పరిధిలో ఆశీల వేలం పాటకు సాల్వెన్స్‌లు 12 గంటలు వరకు వేచిచూసి వాయిదా వేశారు. తిరిగి మళ్లీ నిర్వహించే తేదీ ప్రకటిస్తామన్నారు. మున్సిపల్ ఆర్‌ఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కీర్తనలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అన్నమాచార్యులు వర్ధంతి సందర్భంగా బలగ హరేరామ మందిరంలో శ్రీవారికి స్వరార్చన సింహాద్రి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. వీఆర్‌ఆర్ పద్మజా, 30 మంది గాయకులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ ఠాకూర్‌దాస్ విశ్వనాథం, సంతోష్ బ్రహ్మ, షైలపల్లి రాము, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు న్యాయం చేయాలి

ఇచ్ఛాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సమీపంలో ఈ నెల 25న పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మరణించాడని, ఈ మృతిపై ప్రభుత్వం విచారణ చేపట్టి న్యాయం చేయాలని క్రిస్టియన్ మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు అవినాష్ బాబు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

● ఒక్క రోజులోనే 300 మందితో రిజిస్ట్రేషన్


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): శక్తి యాప్‌తో మహిళలు, విద్యార్థినులకు రక్షణ ఉంటుందని శక్తి బృందాలు తెలిపాయి. ఈ మేరకు బుధవారం శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యం, ఆత్మరక్షణలో శిక్షణపై డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. మునసబుపేటలోని గురజాడ, శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాల, అరసవిల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ తోపాటు రిమ్స్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు యాప్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ చేతిలో శక్తి యాప్ ఒక ఆయుధంగా నిలుస్తుం దని బృందాలు తెలిపాయి. కళాశాలల్లో మహిళ ల భద్రత కోసం ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌ల ను మహిళా పోలీసు స్టేషన్ ఎస్‌ఐ చంద్రకళ పరిశీలించారు. ఈ స్పెషల్ డ్రైవ్ ద్వారా బుధవా రం ఒక్క రోజే రికార్డు స్థాయిలో 300 మంది విద్యార్థినులతో శక్తి యాప్ రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌ఐలు రవి, వాసుదేవరావు, ఏఎస్‌ఐ అరుణ, శక్తి బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇఫ్తార్ విందు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన రంజాన్ - 2025 సందర్భంగా ప్రత్యేక ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తామని ఆ శాఖ అధికారి ఆర్ఎస్ జాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ, సామాజిక నేతలు, మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ ఇఫ్తార్ విందు సాయంత్రం 6.00 గంటల నుంచి అరసవల్లి మిల్లు జంక్షన్ వద్ద గల ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గార, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పూసర్లపాడు గ్రామంలో రూ.5 లక్షలు ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం పంచాయతీ ఉప సర్పంచ్ అరవల పెద్ద బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, టీడీపీ నాయకులు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆమదాలవలస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీభాయ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ మారుతీనగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాదిని అతి దారుణంగా దస్తగిరి అనే వ్యక్తి కత్తులతో దాడి చేసి హత్యచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ హత్యకు నిరసనగా ఒక రోజు కోర్టు విధులను బహిష్కరిస్తూ కోర్టు ఆవర ణలో నిరసన చేపట్టారు. న్యాయవాదులు పీవీ నరసింహం, సాధు ధనుంజయరావు, తమ్మినేని అన్నమనాయుడు, వాడవలస రాజేశ్వరరావు, సనపల ప్రసాద్, గరుగుపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కరమే ప్రజాదర్బార్ ధ్యేయమని కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజలు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల డిల్లీశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళీ, పీవీవీకే రాజు, నాగళ్ల మురళీధర్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీఎఫ్‌సీఐ/టౌన్-1 ఫీడర్ పరిధిలోని ఈ నెల 28వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంతులపేట, సొట్టవానిపేట, ఎఫ్‌సీఐ, మన్నయ్యపేట, చింతాడ, నందిగిరిపేట, సనపలవానిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఎచ్చెర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఐఈఎస్ రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ కన్సల్టెంట్ ఎం.కలేబు అన్నారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులకు ఎంటర్‌పెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పీవీ రమణమూర్తి నాయుడు, ఈసీఈ విభాగాధిపతి డి.తిరుమలరావు, ఎంబీఏ హెడ్ డాక్టర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



ఇచ్ఛాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి రత్తకన్న వద్ద మంగళవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందిందింది. గ్రామస్థుల సమాచారం మేరకు బుధవారం డిప్యూటీ రేంజ్ అధికారి రాము, ఫారెస్ట్ బీట్ అధికారులు మృతి చెందిన జింకను పరిశీలించారు. బెల్లుపడ వెటర్నరీ సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించి దహనం చేశారు.

విమర్శించే స్థాయి లేదు

రణస్థలం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్రజలను నవ్వించేందుకు హాస్యాస్పదమైన స్కిట్స్ ప్రదర్శించవచ్చు, వ్యక్తిగత మనోభావాలు దెబ్బతినేలా ఉండకూడదని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విజయవాడలోని జరిగిన కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్ వేసిన స్కిట్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని విమర్శించేలా ఉందని, ఇటువంటి స్కిట్లు చేయడం మంచి సంస్కృతి కాదని తీవ్రంగా ఖండించారు. ఆయన్ని వమర్శించే స్థాయి లేదన్నారు.

హుండీ లెక్కింపు

ఆమదాలవలస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సూర్యనారాయణ స్వామి దేవస్థానం హుండీను బుధవారం లెక్కించారు. ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి తమ్మినేని రవి ఆధ్వర్యంలో లెక్కించగా రూ.33,222 వచ్చింది. ఇది రెండేళ్ల కాలానికి కానుకల రూపంలో వచ్చినట్టు ఆయన తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

కవిటి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం చేయాలని సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలో బుధవారం వారంతా కలిసి వినతిపత్రాన్ని అందించారు. ● ఇచ్ఛాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజును కోరారు. బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు.

ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు

● అభినందించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్
● జిల్లాలోనూ సేవా కార్యక్రమాలు

టెక్కలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి బృందం): రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకను బుధవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, చీఫ్ సెక్రటరీ విజయానంద్, మంత్రులు, ఎమ్మెల్యేల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వదించగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు కేక్ తినిపించి, బొకేలిచ్చి అభినందించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సీఎం, మంత్రుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపు కోవడం అదృష్టంగా భావిస్తున్నానని, ఈ జన్మదినం తనకు ప్రత్యేక సంతోషాన్ని ఇచ్చిందన్నారు. తనను అభిమానించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విజయవాడలోని మంత్రి నివాసంలో కూడా భార్య విజయమాధవి, కుటుంబ సభ్యుల సమక్షంలో అచ్చెన్నాయుడు కేక్ కట్ చేశారు.


టెక్కలి: అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడుకు కేక్ తినిపిస్తున్న మంత్రి లోకేశ్, చిత్రంలో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్


కోటబొమ్మాళి: కేక్‌ను కట్ చేసి తినిపిస్తున్న నేతలు

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు 54వ జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అలాగే పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హరివర ప్రసాద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, కల్లి నాగయ్యరెడ్డి, కల్లి లక్ష్మణరెడ్డి, దేవాది సింహాద్రి, నంబాళ్ల శ్రీనివాసరావు, కోరాడ గోవిందరావు, సాసుమంతు ఆనందరావు, కోట సంతోష్, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

గొల్లూరులో..

నందిగాం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు మండలంలో బుధవారం నిర్వహించారు. గొల్లూరులో సర్పంచ్ జీరు రాజేశ్వరి నానీరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు, స్థానికులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలాకి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.


గొల్లూరులో కేక్‌ను కట్ చేసి సందడి చేస్తున్న గ్రామస్థులు

డీసీసీబీలో..

శ్రీకాకుళం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను జిల్లా కోపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో బుధవారం నిర్వహించారు. డీసీసీబీ సీఈవో డి.సత్యనారాయణ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జీఎం వరప్రసాద్, జీఎం సిమ్మ జగదీష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



వివాహమైన 50 రోజులకే...

● రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మధు(ఫైల్)

పలాస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వివాహమైన 50 రోజులకే ఓ పెళ్లి కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడిన ఘటన తీవ్ర సంచలనం కలిగించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పలాస మండలం గొల్లమాకన్నపల్లికి చెందిన కోరాడ మధు(28) ద్విచక్ర వాహనంపై వెళుతూ కోసంగిపురం ఫ్లై ఓవర్ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరగ్గా అర్ధరాత్రి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం రావడంతో మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సింగుపురానికి చెందిన కుమారిని ప్రేమించి ఫిబ్రవరి 6న వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో పలాసలో పనిమీద వచ్చి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మృతుడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వివాహం ఆనందం తీరక ముందే మధు మృత్యువాత పడడంతో వారి ఇంటిలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

ఎచ్చెర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇదే పంచాయతీ బారికిపేట గ్రామానికి చెందిన సవలాపురపు లక్ష్మణరావు (52) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణరావు భార్యాబిడ్డలతో కలిసి గత 15 ఏళ్ల నుంచి రాజాంలో ఉంటున్నారు. బుధవారం ఉదయం లావేరు మండలం అదపాక గ్రామంలోని తన బంధువుల ఇంటికి వచ్చిన లక్ష్మణరావు తిరిగి వెళ్లే క్రమంలో అరిణాం అక్కివలస జంక్షన్‌లో దిగి రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. లక్ష్మణరావుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో బడివానిపేట వీఆర్వో..


రాజారావు (ఫైల్)

ఎచ్చెర్ల, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బడివానిపేట గ్రామ సచివాలయం వీఆర్వో పుట్టా రాజారావు(45) బుధవారం విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం 10 గంటల సమయంలో విధులకు హాజరైన రాజారావు.. సాయంత్రం 4 గంటల సమయంలో గుండెపోటుతో ఒక్క సారిగా కుప్పకూలి పోయారు. చిలకపాలెం గ్రామానికి చెందిన రాజారావు వీఆర్ఏగా పనిచేస్తూ.. ఏడాది కిందట పదోన్నతిపై వీఆర్వో బడివానిపేటలో పని చేస్తున్నారు. ఈయనకు భార్య రజని, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. భార్య రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీఆర్వో మృతిపట్ల తహసీల్దార్ బి.గోపాలరావు, రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తంచేశారు.

చికిత్స పొందుతూ ఆర్మీ జవాన్..


ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

టెక్కలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టెక్కలి మేజర్‌పంచాయతీ చేరి వీధికి చెందిన ఆర్మీ జవాన్‌పైల ప్రతాప్‌రెడ్డి (38) మృతి చెందినట్లు కుటుం బసభ్యులు తెలిపారు. ప్రతాప్ రెడ్డి మూడురోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రతాప్‌రెడ్డి మృతదేహన్ని ఢిల్లీ నుంచి ఆర్మీ జవాన్లు స్వగ్రామమైన టెక్కలి తీసుకు రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'పది' పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థికి గాయాలు


విద్యార్థికి ప్రథమ చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ క్లారెట్ పదో తరగతి పరీక్ష కేంద్రం బయట ఒక విద్యార్థికి తలకు బలమైన గాయం అయింది. బసివాడ గ్రామానికి చెందిన విద్యార్థి బండి వెంకటరమణ పదో తరగతి పరీక్ష రాసేందుకు కేంద్రానికి వచ్చాడు. ఉదయం 8.30 గంటల సమ యంలో పాఠశాల ఆవరణలోని ఓ భవనం నీడలో తోటి విద్యార్థులతో కూర్చున్నాడు. బెల్ మోగడంతో కేంద్రంలోకి వెళ్లేందుకు లేవగా భవనం గోడకు ఉన్న ఊచ తల వెనుక భాగంలో తగిలింది. రక్తం కారడంతో వెంటనే ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రంలోని వైద్య సిబ్బందికి తెలియజేయగా వారు ప్రథమచికిత్స చేశారు. విద్యార్థికి వైద్య పరీక్షలు చేసి ఆరోగ్యం నిలకడగా ఉందని గుర్తించారు. ఆ తరువాత విద్యార్థి ఫిజికల్ సైన్సు పరీక్ష రాశాడు. ఘటన జరిగిన వెంటనే ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది స్పందించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు.

అనధికార ఇసుక ర్యాంపు సీజ్



ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర

కొత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సమీపంలో నిర్వహిస్తున్న అనధికార ఇసుక ర్యాంపును తహసీల్దార్ రవిచంద్ర బుధ వారం సందర్శించి సీజ్ చేసి ఇటుక బట్టీ నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో 'అనధికార ఇసుక ర్యాంపు' శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం పోలీసుల సాయంతో స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. ఎటువంటి అనుమతులు లేకుండా వంశధార నది నుంచి అక్రమంగా ఇసుకను తరలించి స్టాక్‌చేసి ఒడిశాకు సరఫరా చేస్తుండడంతో నిర్వాహకులపై చర్యలు తీసుకున్నామన్నారు.

పోలవరం వద్ద ట్రాఫిక్ జామ్

టెక్కలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామంలో పాసిపోలమ్మతల్లి సంబరాల చివరిరోజు సందర్భంగా బుధవారం మధ్యాహ్నం టెక్కలి-తెంబూరు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాల రాకపోకలతో రోడ్డు కిక్కిరిసింది. సీఐ విజయ్‌కుమార్ సిబ్బందితో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టినప్పటికీ పోలవరం నుంచి పెద్దసాన రైల్వేస్టేషన్ వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహన రాకపోకలకు మార్గం సుగమం చేయడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పోలాకి: హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట/పోలాకి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజలు వారి సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండలం కత్తిరివానిపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గ్రామాల్లో కాలువలు ఏర్పాటు చేయాలని పలువురు వినతిపత్రాలు అందించారు. అలాగే గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలో గృహ నిర్మాణ పనులపై ఆరా తీశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు ఉండాలన్నారు. అనర్హులకు ఇళ్లు ఇస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నరసన్నపేట ప్రజాసదన్‌లో మంత్రి అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ సభ్యత్వంతో గుర్తింపు

జలుమూరు (సారవకోట), మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సవరడ్డపనస పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వం పొందిన వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బగ్గు అర్చన, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, నాయకులు సాధు చిన్నికృష్ణంనాయుడు, సురవరపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్లాట్ వచ్చేందుకు కృషి

● ఎమ్మెల్యే గౌతు శిరీష


లబ్ధిదారులకు పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కాశీబుగ్గ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ప్లాట్ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో ఎంఐజీ లే అవుట్-1లో 240 చదరపు గజాల ప్లాట్లకు బుధవారం కాశీబుగ్గలో ఓ కల్యాణ మండపంలో డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ లేఅవుట్‌లో ప్లాట్‌రాని వారికి లేఅవుట్-2లో అవకాశం కల్పిస్తారని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. మరో 10 రోజుల్లో లేఅవుట్-2లో డ్రా తీస్తార న్నారు. లబ్ధిదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారన్నారు. మధ్యాహ్నం 200, 150 చదరపు గజాల ప్లాట్లను డ్రా తీశారు. డ్రాలో ఎంపికైన వారికి త్వరలో సమా చారం అందించి మిగిలిన ప్రక్రియ చేపడతామని సుడా అధికారులు పేర్కొ న్నారు. కార్యక్ర మంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సుడా పీవో అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

పలాసరూరల్,మార్చి26(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు సమయాన్ని వృథా చేయకుండా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వెలుగు కార్యాలయంలో ఫ్యూజన్ ఫైనాన్స్, బ్లూస్టార్, యూనీఛార్మ్ కంపెనీల ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాల్లో అర్హులైన వారు ఉద్యోగం సాధించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. జాబ్‌మేళాకు 72మంది అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐడీఎంఎ ఎస్.రమణమూర్తి, డీపీ ట్రైనర్ కె.కవిత, జేసీవో ఎల్. నాగేశ్వరరావు, పలాస మండల టీడీపీ అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, ఏపీఎం కె.జాంభవతి పాల్గొన్నారు.

600 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న గ్లో సంస్థ కార్యదర్శి యార్లగడ్డ వెంకన్నచౌదరి

పలాస, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ (గ్లో) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు సుమారు 600 మందికి వైద్య పరీక్షలు చేసి 50 మందికి ఉన్నత వైద్య చికిత్సలు అందించేందుకు గుర్తించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, దీర్ఘకాలిక వ్యాధులను కూడా నయం చేయించేందుకు గ్లో సంస్థ ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఏటా వైద్య శిబిరాలను నిర్వహించి కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. క్యాన్సర్, ఆర్థో, ఈఎన్‌టీ, కంటివైద్యం, న్యూరాలజీ, గుండెపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి, పలాస టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్నచౌదరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, జోగ మల్లి, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.

గ్రావెల్ రవాణాకు స్థానిక వాహనాలను వినియోగించాలి

కోటబొమ్మాళి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట కొండ సమీపంలో బుధవారం పోర్టు వాహనాలను స్థానిక టిప్పర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మంచాల కేశవరావు ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. స్థానికేతరులను వాహనాలను పోర్టు యాజమాన్యం ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి వినియోగిస్తుండడం దారుణమన్నారు. ఇక్కడ గ్రావెల్, ఇసుక రవాణాకు స్థానిక వాహనాలనే వినియోగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై మంత్రి అచ్చెన్నాయుడు కంపెనీ యాజమాన్యానికి సూచించినప్పటికీ యాజమాన్యం పట్టిం చుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పోర్టు యాజమాన్యం ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, వాహనదారులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి: ఆర్డీవో


గ్రామాల సరిహద్దులను పరిశీలిస్తున్న ఆర్డీవో

పాతపట్నం, మార్చి 26(ఆంధ్ర జ్యోతి): ఉద్దానం ఫేజ్-2 పనులు వేగవంతం చేయాలని టెక్కలి ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి ఆదేశించారు. బోరుభద్ర, కొరసవాడ, కాగువాడలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిమిత్తం కొరసవాడ, బోరుభద్ర పరిధిలో నాలుగు ఎకరాల భూసేకరణ చేపట్టాలని తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్‌కు ఆదేశిం చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఆశాలత, ఎంపీడీవో పి.చంద్రకుమారి పాల్గొన్నారు.

● మెళియాపుట్టి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాజెక్టుకు, ఏకలవ్య పాఠశాలకు భూవివాదం రాకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఏకలవ్య, ఉద్దానం ప్రాజెక్టుకు సంబంధించి సమస్య ఉన్న స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు తదితరులున్నారు.

పంటలపై అవగాహన అవసరం

వజ్రపుకొత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి పంటలపై అవగాహన పెంచుకోవాలని బాపట్ల పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమామహేశ్వరరావు, కీటక శాఖ నిపుణులు డాక్టర్ స్రవంతి అన్నారు. బుధవారం పాత టెక్కలిలో జీడిమామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీడి మామిడి, కొబ్బరి పంటలలోని సమస్యలను గుర్తించి వాటి నివారణకు అవసరమైన సూచనలు, సలహాలు అందిం చారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి సునీత, మాజీ సర్పంచ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

హరిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాధాకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో బాలికలు చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేసినట్లు ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన పరీక్ష ఏప్రిల్ 13 ఆదివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా ఈ మార్పును గమనించాలని కోరారు.

20వ తేదీకి ప్రవేశ పరీక్ష వాయిదా

మెళియాపుట్టి,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వచ్చేనెల 6న జరగాల్సిన ప్రవేశ పరీక్ష అదేనెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్లకు ప్రవేశం కోసం పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఏప్రిల్ 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

పోలాకి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్, సూపరిటెండెంట్ బలగ ప్రకాష్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ వ్యక్తిగత, సామూహిక రుణాల కోసం సుమారు 1000 దరఖాస్తులు వచ్చాయన్నారు. 153 యూనిట్లు లక్ష్యమ న్నారు. విద్యార్హత, వయసు, అదనపు అర్హతలు ప్రామాణికంగా తీసుకుని ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని యూనిట్లు ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

వజ్రపుకొత్తూరులో..

వజ్రపుకొత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, కాపు రుణాల కోసం శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు తెలిపారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు జిరాక్సులతో పాటు ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని కోరారు.

జలుమూరులో..

జలుమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో స్క్రూటినీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.అప్పలనాయుడు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారు ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరై వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. మండలంలో 97 యూనిట్లకు గాను 467 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

100 రోజుల పని దినాలు కల్పించండి

జలుమూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేతనదారులకు 100 రోజుల పని దినాలు కల్పించాలని ఎంపీడీవో కె.అప్పలనాయుడు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే 90 రోజులు పనిచేసిన వేతనదారులకు ఈ నెలాఖరుకు మిగిలిన పని దినాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏపీవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధి మెరుగుకు కృషి

హరిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాల మహిళల్లో జీవనో పాధి మెరుగుకు కృషి చేస్తున్నట్లు వెలుగు డీపీఎం ఉన్నతి శ్రీధర్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో బుధవారం మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల్లోని విద్యా వంతులైన మహిళలను గుర్తించి యాప్‌లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం పైడి కూర్మారావు, స్త్రీనిధి మేనేజర్ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు సోషల్ ఆడిట్ ప్రజావేదిక

టెక్కలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో నెలరోజుల పాటు క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందాలు చేసిన నివేదికలను ప్రకటిస్తారన్నారు.

అనుబంధ విభాగాల పనితీరే పార్టీకి బలం

టెక్కలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పార్టీలో అనుబంధ విభాగాలు ఎంత గట్టిగా పనిచేస్తే పార్టీకి అంతే బలమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం టెక్కలిలో ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండలస్థాయిలో కమిటీలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ తిలక్, ఎంపీపీ శ్రీరామ్మూర్తి, రాహుల్, శ్రీధర్‌రెడ్డి, గణపతిరావు, చిన్ని జోగారావు యాదవ్, దర్మారావు పాల్గొన్నారు.

ఎండ తీవ్రత కారణంగా జాగ్రత్తలు తీసుకోవాలి

టెక్కలి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత అధికంగా ఉంటున్నందున దుకాణాలు, పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ రాధాకుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ పరిశ్రమలు, కర్మాగారాలు, వర్క్‌షాపులు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఎండలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. పనివేళలు రీషెడ్యూల్ చేయాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు కార్మికులు పనికి దూరంగా ఉండాలని, నీడ ప్రదేశంలో ఉండే పనులు చేయించు కోవాలన్నారు. కార్మికులకు తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు.

చైతన్యవంతంగా వ్యవహరించాలి

నందిగాం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రైతులు చైతన్యవంతంగా వ్యవహరించడం ద్వారా పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రాంతీయ, తీర ప్రాంత వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కిరణ్‌గాంధీ, కె.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పాలవలసలో ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రైతులకు సీఆర్‌ధాన్ 412, 414 వరి రకాల ప్రదర్శన క్షేత్రం నిర్వహించి రైతులకు పనిముట్లు అందించారు. కార్యక్ర మంలో వ్యవసాయాధికారి డి.శ్రీకాంత్‌వర్మ, సర్పంచ్ బి.సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు ఉగాది సంబరాలు

నందిగాం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పెద్దతామరాపల్లిలో టెక్కలి నియోజకవర్గ తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలో మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమయ్యే వేడుకల్లో భాగంగా ఆవుదూడల ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

30న ఉగాది ఉత్సవం

పలాసరూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 30న ఉగాది ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుమార్‌నాయక్, బి.కాళిదాసు ఒక ప్రకట నలో తెలిపారు. స్థానిక కణితి విశ్వనాథం గృహ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా పంచాంగశ్రవణం, ఐదుగురు పద్య కవులకు సత్కారం, చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సోంపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం కుంబరినౌగాం గ్రామానికి చెందిన దండాసి చౌదరి సారా తరలిస్తుండగా పట్టుబడినట్టు ఎక్సైజ్ సీఐ కే.బాబీ తెలిపారు. సారాను నిర్మూలించేందుకుగాను మాలగోవిందపురం, పైడిగాం, కొరంజిభద్ర గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు.